క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో రాణించాలి



విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, సంఘం నాయకులు

మద్దిలపాలెం : యాదవ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో విద్యలో రాణించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచించారు. విశాఖ యాదవ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యాదవ విద్యార్థులకు 2025 సంవత్సరానికి ప్రతిభ పురస్కారాలు శివాజీపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం అందజేశారు. యాదవ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఉరుకూటి రాజారావు, ప్రధాన కార్యదర్శి డొక్కర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 250 మంది విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయమన్నారు. సంఘం అధ్యక్షుడు ఉరుకూటి రాజారావు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో విద్యను అభ్యసిస్తే అభ్యున్నతి సాధిస్తారన్నారు. అనంతరం ఏయూ ఆచార్యులు శ్రీనివాసరావు నేతృత్వంలో కెరీర్ గైడెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు, బొట్టా వెంకటరమణ, విశాఖ యాదవ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ప్రగడ చిన్నారావు, డొక్కర శ్రీనివాసరావు, జగన్, మట్టా సత్యనారాయణ, జోగ నూకరాజు, ఆచార్య శ్రీనివాస్, రమేష్, నమ్మి వెంకట్ పాల్గొన్నారు.

సీతమ్మధార ట్రెజరీలో తప్పుడు బిల్లుపై స్పందన

- ఏటీవోకు మెమో జారీ
- బిల్లు వెనక్కి పంపిన డీటీవో

సాక్షి ఎఫెక్ట్..

మహారాణిపేట: సీతమ్మధార ట్రెజరీలో తప్పుడు బిల్లుల బాగోతంపై స్పందన లభించింది. దీనిపై తక్షణం వివరణ ఇవ్వాలని జిల్లా ట్రెజరీ అధికారి (డీటీవో) వై.సుధాకరరావు సీతమ్మధార అసిస్టెంట్ ట్రెజరీ అధికారి గోవిందరావుకు మెమో పంపారు. ఇదే కార్యాలయంలో ప్రభుత్వ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన ఈశ్వర వర్మ ఎరియర్స్ బిల్లుల్లో తప్పుడు లెక్కలు చూపించినట్టు సాక్షిలో కథనం ప్రచురితమైన సంగతి విదితమే. దీనిపై ట్రెజరీ అండ్ అకౌంటెంట్ శాఖ డైరెక్టర్ మోహనరావు మౌఖిక ఆదేశాల మేరకు డీటీవో సుధాకరరావు మెమో జారీ చేశారు. అలాగే బిల్లును వెనక్కి పంపినట్టు డీటీవో వై.సుధాకరరావు ఆదివారం సాక్షికి తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని డీటీవో కోరారు. ఈ ఘటనలో డైరెక్టర్ పేరు వాడిన బిల్లును త్వరిత గతిని పూర్తి చేయడానికి ప్రయత్నాలు జరినట్టు భోగట్టా. ఈ సంఘటనను మసిపూసి మారేడు కాయ చేయడానికి గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలో ఇలాంటి సంఘటనలో ఒక ఉద్యోగికి రెండు ఇంక్రిమెంట్లు కట్ చేసి క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు ఏం జరుగుతుందోనని అంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

ఆకట్టుకున్న 'బుద్ధునితో నా ప్రయాణం'



అంబేడ్కర్ భవన్‌లో బుద్ధునితో నా ప్రయాణం నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం 'బుద్ధునితో నా ప్రయాణం' తెలుగు నాటకాన్ని ప్రదర్శించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, కార్పొరేటర్ గంగారావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ అభ్యుదయం అకాడమీకి చెందిన 40 మంది కళాకారులు నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. దుఃఖం, పేదరికం, హింసకు మూలాలు, వాటికి విముక్తి మార్గాలు, బుద్ధుడి సందేశం, జీవిత చరిత్ర, బుద్ధిజం భారతదేశానికి ఎందుకు అవసరం, అంబేడ్కర్ ఆలోచనలను చక్కగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీకి భారత రాజ్యాంగం ఒరిజనల్ ప్రతిని బహూకరించారు.

పేదలకు పండ్లు పంపిణీ

ఆరిలోవ : జీవీఎంసీ 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం ముస్తఫాకాలనీలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అక్కడి వృద్ధుల మధ్య ఆమె కేకు కట్ చేసి అనంతరం ఆపిల్, అరటి పళ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

ఈఎన్‌టీ ఆస్పత్రిలో సేవలు అధ్వానం



- వేలాది మంది రోగులకు డిప్యుటేషన్ నర్సులతోనే వైద్యం
- ముఖ్యమైన రక్త పరీక్షలు, స్కానింగ్ చేయలేని పరిస్థితి
- సర్జరీలు ఆలస్యంగా జరుగుతున్నాయని రోగుల ఆవేదన
- ఉత్తరాంధ్ర రోగులకు తప్పని ఇబ్బందులు

బీచ్ రోడ్డు : ఉత్తరాంధ్రలో చెవి, ముక్కు, గొంతు సమస్యలతో బాధపడే వేలాది మంది రోగులకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన విశాఖ ఈఎన్‌టీ ఆస్పత్రిలో పరిస్థితి అధ్వానంగా తయారైంది. సొంత నర్సింగ్ సిబ్బంది లేకపోవడంతోపాటు సర్జరీలకు అవసరమైన కీలకమైన రక్త పరీక్షలు కూడా ఇక్కడ చేయడం లేదు. రోగులకు సాధారణంగా ముక్కులో వేసే డ్రాప్స్ కూడా కొన్ని అందుబాటులో లేవంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మెరుగైన వైద్యం మాట అటుంచితే... రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

స్టాఫ్ నర్సులంతా డిప్యుటేషన్‌పైనే...

రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో డాక్టర్ తర్వాత స్టాఫ్ నర్సులదే కీలక పాత్ర. అటువంటి స్టాఫ్ నర్సుల కోసం ఈఎన్‌టీ ఆస్పత్రి పూర్తిగా ఇతర ఆస్పత్రులపై ఆధారపడుతోంది. ప్రస్తుతం ఇక్కడ 25 మంది స్టాఫ్‌నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే వీరిలో ఒక్కరు కూడా ఇక్కడి పర్మినెంట్ స్టాఫ్ నర్సు కాకపోవడం విశేషం. పది మంది కేజీహెచ్‌కు చెందిన వారు కాగా మిగిలిన 15 మంది విమ్స్ ఆస్పత్రికి సంబంధించిన నర్సింగ్ సిబ్బంది. మరోవైపు ఇక్కడ నలుగురు హెడ్ నర్సులు ఉండగా వారిలో ఒకరు విమ్స్ ఆస్పత్రికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. వంద పడకలున్న కీలకమైన ఆస్పత్రికి సొంతంగా ఒక్క స్టాఫ్‌నర్సు కూడా లేకపోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమనే వాదన బలంగా వినిపిస్తోంది. గతంలో అవుట్ సోర్సింగ్ ద్వారా 10 మంది స్టాఫ్‌నర్సులతో సేవలందించేవారు. అనంతరం 2021లో డిప్యుటేషన్‌పై స్టాఫ్ నర్సులను తీసుకొచ్చారు. అప్పటి నుంచి వారితోనే ఆస్పత్రిని నడుపుతున్నారు తప్ప సొంతంగా సిబ్బందిని నియమించడం లేదు. ఈ ఆస్పత్రిలో రోజూ 100 మంది ఇన్ పేషెంట్స్, 500 మంది అవుట్ పేషెంట్స్ నమోదవుతుంటారు. అటువంటి ఆస్పత్రిలో అధికారుల నిర్లక్ష్యం వల్ల రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. తమకంటూ సొంత నర్సింగ్ సిబ్బంది లేని ఏకైక ప్రభుత్వ ఆస్పత్రి ఇదేనేమో అని రోగులు విమర్శిస్తున్నారు.

ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్లే...

ఉత్తరాంధ్రలో ఎంతో కీలకమైన ఈఎన్‌టీ ఆస్పత్రిని ఉన్నతాధికారులు కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇక్కడ సిబ్బంది కొరత లేకుండా నియామకాలు చేపట్టారు. ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉండడానికి స్థానిక అధికారులతోపాటు ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే కారణంగా కనిపిస్తోంది. ఇతర ఆస్పత్రుల సిబ్బంది సాయంతో నడిపించాలనే ఆలోచనే తప్ప... నర్సింగ్ సిబ్బంది, వైద్య పరీక్షలు వంటి సదుపాయాలు ఏర్పాటు చేయాలనే ఆలోచన అధికారులకు లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈఎన్‌టీ ఆస్పత్రికి నర్సింగ్ సిబ్బందిని నియమించడంతోపాటు రక్త పరీక్షలు, స్కానింగ్‌కు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

స్కానింగ్, రక్త పరీక్షలన్నీ ఇతర ఆస్పత్రుల్లోనే..

రోగుల సర్జరీలకు అవసరమైన చాలా వైద్య పరీక్షలు ఈఎన్‌టీ ఆస్పత్రిలో చేయడం లేదు. కీలకమైన రక్త పరీక్షలన్నీ బయటే చేయించుకోమని రోగులను వైద్యులు పంపించేస్తున్నారు. ముఖ్యంగా సిటీ, ఎంఆర్‌ఐ స్కాన్ కూడా ఇక్కడ అందుబాటులో లేవు. వీటి కోసం రోగులు బయటకు వెళ్లాల్సి రావడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. స్కానింగ్ కోసమని కేజీహెచ్‌కు రోగులను పంపితే... అక్కడి సిబ్బంది రోజుల తరబడి స్కానింగ్ చేయకుండా రోగులను, వారి బంధువులను తిప్పుతున్నారు. దీంతో కీలకమైన సర్జరీలు చాలా ఆలస్యంగా జరుగుతున్నాయని రోగులు వాపోతున్నారు.

కేజీహెచ్, విమ్స్ సిబ్బందిపై భారం

మరోవైపు ఈఎన్‌టీ ఆస్పత్రికి నర్సింగ్ సిబ్బంది లేకపోవడంతో ఇతర ఆస్పత్రుల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకొచ్చేయడంతో అక్కడ కూడా ఇబ్బందులు ఎదురవడంతోపాటు మిగిలిన వారిపై పనిభారం పడుతోంది. ఆ ఆస్పత్రులకు వచ్చే రోగులకు అక్కడి సిబ్బంది సరైన వైద్యం అందించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే కేజీహెచ్, విమ్స్ ఆస్పత్రి నుంచి 25 మంది స్టాఫ్ నర్సులను ఈఎన్‌టీకి డిప్యుటేషన్‌పై తీసుకొచ్చేయడంతో అక్కడి రోగులకు సరైన వైద్యం అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు రక్త పరీక్షలు, థైరాయిడ్ ప్రొఫైల్, హెచ్‌ఐవీ పరీక్షల నిమిత్తం చెస్ట్ ఆస్పత్రికి ఈఎన్‌టీ హాస్పిటల్ నుంచి రోగులను పంపుతున్నారు. దీంతో అక్కడి రోగులకు వైద్య, రక్త పరీక్షలు ఆలస్యమవుతున్నాయి.

వైభవంగా రుక్మిణి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మద్దిలపాలెం : త్యాగరాజ ఆరాధన ట్రస్ట్, నారాయణ తీర్థం తరంగిణి సంయుక్తంగా రుక్మిణి కల్యాణాన్ని మద్దిలపాలెం కళాభారతిలో అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. ముందుగా విశ్వక్షేన పూజ, పుణ్యాహవచనం చేశారు. తిరుపతి నుంచి వచ్చిన కంకణాలతో స్వామికి, అమ్మవారికి కంకణధారణ చేసి భక్తులందరికీ అందించారు. అనంతరం జీలకర్ర బెల్లం, మంగళసూత్రధారణ, ముత్యాల తలంబ్రాలు, మంత్రపుష్పం, మంగళహారతి తర్వాత భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన 780 మందికి పెళ్లి భోజనం పెట్టారు. అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి డాక్టర్ రాంబాబు, కోశాధికారి సుసర్ల రామ్ గోపాల్, పప్పు హనుమంతరావు, జస్టిస్ క్రిష్ణ జ్యోతి పాల్గొన్నారు.

యువత రక్తదానం

సీతంపేట: స్థానిక రామాటాకీస్ ఎదురుగా ఉన్న వాయుపుత్ర హెల్త్‌క్లబ్‌లో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. జాతీయ బాడీ బిల్డర్ కిలాని శ్రీనివాసు, పాత్రికేయుడు కురసాల సురేష్ బాబు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 38 మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి గాయత్రి విద్యా పరిషత్ డైరెక్టర్ డి.గిరిధర్ ప్రారంభించారు. విశాఖ జిల్లా ట్రెజరీస్ విభాగం అధ్యక్షుడు ఎం.జయకుమార్, ఫిల్మ్ డైరెక్టర్ యాద్‌కుమార్, సిహెచ్.రవికుమార్, ఆంధ్ర బాడీ లిఫ్ట్ సంఘం అధ్యక్షుడు ఎస్.ఎస్.శివ శంకర్, కోటిరెడ్డి, పిల్లి సురేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆరిలోవలో రెచ్చిపోతున్న అల్లరిమూకలు

పాత పోలీస్ స్టేషన్ వద్ద అవుట్ పోస్టు నిర్వహించాలని స్థానికుల డిమాండ్



ఆరిలోవలో ఖాళీగా ఉన్న పాత పోలీస్ స్టేషన్ భవనం

ఆరిలోవ : ఆరిలోవ పోలీస్ స్టేషన్‌ను కొత్త భవనంలోకి తరలించిన తర్వాత అల్లర్లు పెరిగిపోయాయి. ఆరిలోవ కాలనీ, ఆఖరి బస్టాప్, దుర్గాబజార్, పాత పోలీస్ స్టేషన్, టి.ఐ.సి.పాయింట్, ముస్తఫాకాలనీ, బాలాజీనగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లో అల్లరి మూకల హడావిడి పెరిగిపోయింది. వీరు తరుచూ అల్లర్లకు దిగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. పాత పోలీస్ స్టేషన్ స్థానంలో ఇక్కడ పోలీస్ అవుట్ పోస్టు నిర్వహిస్తే అల్లర్లు తగ్గుతాయని స్థానికులు భావిస్తున్నారు. పోలీస్ అధికారులు ఖాళీ చేసిన పాత పోలీస్ స్టేషన్‌లో అవుట్ పోస్టు ఏర్పాటు చేసి అక్కడ కొందరు సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు. ఇక్కడ పోలీసులు లేకపోవడంతో అల్లర్లు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పోలీస్ స్టేషన్ ఇరుకుగా ఉండటంతో విమ్స్ ఆవరణలో కొత్తగా విశాలమైన భవనం నిర్మించి గత ఏడాది డిసెంబర్ 8న అందులోకి పోలీస్ స్టేషన్‌ను తరలించారు. విశాలమైన ఆరిలోవ ప్రాంతానికి ఈ ప్రస్తుత పోలీస్ స్టేషన్ కొంత దూరంగా ఉండడంతో పోలీసుల సంచారం తగ్గిపోయింది. దీంతో అల్లరి మూకలు, గంజాయి బ్యాచ్‌లు విచ్చలవిడిగా రోడ్లపైకే వస్తున్నారు. పాత పోలీస్ స్టేషన్ రోడ్డుపైనే బైక్‌లపై త్రిపుల్ రైడింగ్‌తో పెద్ద హారన్‌లు కొడుతూ స్థానికులను బెంబేలెత్తిస్తున్నారు. పాత పోలీస్ స్టేషన్‌లో అవుట్‌పోస్టు ఏర్పాటు చేసి పోలీస్ సిబ్బందిని నియమిస్తే అల్లర్లకు అడ్డుకట్ట పడుతుందని స్థానికులు భావిస్తున్నారు. పోలీస్ అధికారులు అవుట్‌పోస్టు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇంటింటికీ కూటమి ప్రభుత్వ మోసాలు

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు, నాయకులు



జీవీఎంసీ 12వ వార్డు కార్యకర్తలతో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు

ఆరిలోవ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వైఎస్సార్ సీపీ కార్యకర్తలంతా ఇంటింటికీ తీసుకెళ్లాలని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు సూచించారు. జీవీఎంసీ పన్నెండో వార్డులో వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్లతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని కన్వీనర్లు, కార్యకర్తలకు పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేపట్టి కార్యకర్తలు తలెత్తుకొనే విధంగా పరిపాలన సాగిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మోసపూరిత పాలన చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బలమంతా కార్యకర్తలేనని తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను, సోషల్ మీడియా యాక్టివిస్టులను ఇబ్బంది పెడుతూ కేసులు నమోదు చేస్తుందన్నారు. పన్నెండో వార్డులో కార్యకర్తలు కూటమి మోసాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో మొల్లి హేమంత్, సత్తి మందారెడ్డి, సూర్యారావు, శ్రీను, సత్యనారాయణ, ముద్దాడ పాపారావు, ఈగల బుజ్జి, కొండమ్మ, సుజాత, బొండా ఉమా, మువ్వల శ్రీను, రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మత్స్యకారుల అభివృద్ధి

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీతోనే మత్స్యకారుల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ 19 వార్డు పార్టీ అధ్యక్షుడు సూరాడ దాసు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసిందన్నారు. వేట విరామ సమయంలో ఆర్థిక సాయం అందించి మత్స్యకార కుటుంబాలను ఆదుకున్నారని గుర్తు చేశారు. ప్రమాదాల సమయంలో అవసరమైన తక్షణ సాయాన్ని అందించారన్నారు. ఇదే తరహాలో మత్స్యకారులు అభివృద్ధి దిశగా ముందుకు సాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలును గడప గడపకు వెళ్లి వివరించాలని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సూచించారు. ఓటర్లను మోసం చేసి అడ్డదారిలో గద్దెనెక్కేందుకే కూటమి నాయకులు మోసపూరిత హామీలు ఇచ్చారని... ఆ హామీలను నెరవేర్చకుంటే ఊరుకునేది లేదంటూ కూటమి నాయకులను ప్రజలు నిలదీయాలని సూచించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సూరాడ వెంకటలక్ష్మి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు పులగం కొండారెడ్డి, కారి శ్రీలక్ష్మి, పిల్లా సత్యవతి, వసంత, రాజారావు, బుజ్జి పాల్గొన్నారు.

నమ్మి మోసపోయిన ప్రజలకు అండగా నిలుద్దాం



పెదవాల్తేరులో స్థానికులతో వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు

- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు

బీచ్‌రోడ్డు : మోసం, దగా, కుట్రలకు పేటెంట్ హక్కు చంద్రబాబుదేనని వైఎస్సార్ సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం జీవీఎంసీ 20వ వార్డు పెద్దవాల్తేర్ గ్రామంలో బూత్ నంబర్ 134లో కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను వివరించారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు, ఇప్పుడు నెరవేర్చిన హామీలపై అవగాహన కల్పించారు. మోసపోయిన ప్రజలకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజల తరపున వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని తెలిపారు. ఎన్నికల ముందు జగనన్న సంక్షేమం కన్నా రెట్టింపు ఇస్తామని అబద్ధపు హామీలు ఇచ్చిన కూటమి నేతలను నిలదీయాలన్నారు. మోసం చేయడంలో చంద్రబాబుకు 40 ఏళ్ల అనుభవం వుందని... మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధిని కూడా తన ఖాతాలో వేసుకోవడానికి నిస్సిగ్గుగా ప్రయత్నిస్తున్నారన్నారు. పేద ప్రజల గుండె చప్పుడు తెలిసిన నేతగా దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమాన్ని అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలోనే మోసపోయామని ప్రజలకు పూర్తిగా అర్థమైందన్నారు. ఇక చంద్రబాబును నమ్మే ప్రసక్తే లేదని, జగనన్న కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్, 20వ వార్డు అధ్యక్షుడు యనమ రెడ్డి కుమార్ రెడ్డి, వార్డు అబ్జర్వర్ సుబ్రమణ్యం, తూర్పు నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు రవి కిరణ్ రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు తరుణ్ రెడ్డి, ఆర్టీఏ విభాగ అధ్యక్షుడు మద్ది రమణారెడ్డి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కాగితాల రమణారెడ్డి, 134వ నంబర్ బూత్ అధ్యక్షుడు కంబాపు అప్పలరాజు, సీనియర్ నాయకులు యనమ రెడ్డి రమణారెడ్డి, మద్ది పోలిరెడ్డి, ఎంపాడ వెంకటరమణ, రౌతుల వాసు, కాగితాల రామిరెడ్డి, కాగితాల మహేష్, సావాడ శేఖర్, కాగితాల అప్పలరెడ్డి, కాగితాల శేషు, కాగితాల గోపి, సప్పిడి వెంకట్రావు, పిల్లి శివ, సారి పిల్లి సోమేష్, పిలక శ్రీనివాసరెడ్డి, రవణమ్మ, మారడ ఎల్లమ్మ, శంకరమ్మ, యువత రెడ్డి, ఈగల సత్యవతి, పద్మ పాల్గొన్నారు.

● 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని జీవీఎంసీ 28వ వార్డు భానోజీనగర్ బూత్ 195, 196లో కార్పొరేటర్ పల్లా అప్పలకొండ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ప్రజలతో మాట్లాడారు. గడప గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు పులగం కొండారెడ్డి, వార్డు అధ్యక్షుడు రాపాక శ్రీనివాస్, సంపంగి సురేష్, కోన కామేశ్వరరావు, బంగారు భవానీశంకర్, తెలుగు చంద్రరావు, కొండ్రు అప్పారావు, అడపాక మునీంద్రనాథ్, సోమదుల అప్పలరాజు పాల్గొన్నారు.



28వ వార్డులో చంద్రబాబు మోసాలు వివరిస్తున్న మొల్లి అప్పారావు

బీసీ సంక్షేమ సంఘంలో నియామకాలు

సీతంపేట: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల కమిటీలో చురుగ్గా పనిచేస్తున్న పలువురికి వివిధ హోదాల్లో నియామక పత్రాలు అందజేశారు. సంఘ ఉత్తరాంధ్ర జోన్ ఇన్‌చార్జి దాడి అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఆదివారం అక్కయ్యపాలెంలో జరిగిన సమావేశంలో కొత్తగా నియమితులైన వారికి ముఖ్య అతిథులు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు రేవు శ్రీనివాసరావు చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పోతిన పైడిరాజు, సనపల రామకృష్ణ, తన్నీరు ఉమామహేశ్వరరావు, జాతీయ కార్యదర్శిగా కిలపర్తి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శిగా బగాది శ్యామల, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోతిన ప్రసాద్, ఉత్తరాంధ్ర జోన్ మీడియా కోఆర్డినేటర్‌గా కొత్తల అరుణ్ ప్రసాద్ నియామక పత్రాలు అందుకున్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలి



వెర్నిదుర్గానగర్‌లో ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ : పెరిగిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ సీపీఐ నాయకులు ఆదివారం ఆరిలోవ ప్రాంతంలో ర్యాలీ చేపట్టారు. సీపీఐ ఆరిలోవ జోన్ ఆధ్వర్యంలో ర్యాలీ చేట్టిన నాయకులు జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి వెర్నిదుర్గానగర్‌లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహ్మాన్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల ముందు కూటమి నాయకులు అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, చార్జీలు ఎప్పుడూ పెంచబోమని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు పక్కనపెట్టి ఏడాదిలో మూడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి సాధారణ ప్రజలపై అధిక భారం మోపారన్నారు. బీజేపీ చెప్పినట్లు కూటమి ప్రభుత్వంలో నాయకులు చేసుకుపోయి పేదలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. పెంచిన ట్రూ అప్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు అమర్చడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాసుబాబు, లక్ష్మణరావు, పుష్పలత, మధు, విజయ తదితరులు పాల్గొన్నారు.

జానపద కళలు వారసత్వ సంపద

సీతంపేట: ఆధ్యాత్మిక ప్రవచన కర్త రామకృష్ణానందకు 'ప్రవచన వాచస్పతి', గేయ రచయిత ఐనాడ దుర్గాప్రసాద్‌కు 'జన కవి' బిరుదులు ప్రదానోత్సవం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. శ్రీమాతా కళాపీఠం ఆధ్వర్యంలో, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథి వ్యాపారవేత్త యార్లగడ్డ వెంకన్న చౌదరి చేతుల మీదుగా బిరుదులు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులను గుర్తించి వారి కళలకు ప్రాచుర్యం అందించిన ఘనత శ్రీమాతా కళాపీఠానికే దక్కిందన్నారు. కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ జానపద కళలు మన వారసత్వమని, వాటిని కాపాడుకోవడం మన కర్తవ్యమని, అందులో భాగంగా ఈ సన్మాన కార్యక్రమం చేస్తున్న శ్రీమాతా కళాపీఠం అధినేతలను కొనియాడారు. రామకృష్ణానంద ప్రవచన కర్తగా తన వాగ్ధాటితో ప్రజలలో ధర్మ, నిర్మలత్వం, నైతికతను పెంపొందిస్తున్నారన్నారు. దుర్గాప్రసాద్ ఐనాడ తన రచనలతో పండిత పామర రంజితంగా సామాజిక సమస్యలపై పాటలు రాసి సమాజ చైతన్యానికి కృషి చేస్తున్నరని ప్రశంసించారు. కార్యక్రమంలో శ్రీరామనారాయణం టెంపుల్ చైర్మన్ ఎన్‌సీఎస్ఈ శ్రీనివాస్, పాడేరు ఎంపీడీవో కుసుమ హర రమేష్, శ్రీమాతా అధినేతలు బి.ఎస్.మూర్తి, పి.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.